పరిహారం కోసం ఎదురుచూపులు

- వరదలకు వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- పంటనష్టం అంచనాలు పూర్తి
- అయినా నేటికీ అందని పరిహారం
- 25న ఇస్తామంటున్న ప్రభుత్వం
- ఇప్పటికే రెండుసార్లు వాయిదా
- ఆశగా ఎదురుచూస్తున్న బాధిత రైతులు

కంచికచర్ల: ఇటీవల కురిసిన భారీవర్షాలు, సంభవించిన వరదలకు నందిగామ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో రుతుపవనాలు వస్తున్నాయనే సమాచారంతో ముందస్తుగా సాగు ప్రారంభించిన నందిగామ ప్రాంత రైతులను ఈ వరదలు నిండాముంచాయి. ముఖ్యంగా వరిపంట సాగుచేసిన రైతులు తీవ్రనష్టాన్ని చవిచూశారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండుతాయనే ఆశతో చేపట్టిన సాగుకాస్తా..వరదలకు దెబ్బతిని తీరనినష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. అయితే పంటనష్టపరిహారం అంచనాలు పూర్తయి ఇప్పటికే పూర్తయిన పరిహారం మాత్రం ఇంకా రైతులకు అందలేదు.

28,347ఎకరాల్లో పంటనష్టం..

వరదలకు నందిగామ నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో మొత్తం 28,347ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. అత్యధికంగా చందర్లపాడు మండలంలో 9,035ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, కంచికచర్ల మండలంలో 9,005ఎకరాలు, నందిగామ మండలంలో 6,080 ఎకరాలు, వీరులపాడు మండలంలో 4,227 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు.



ఇటీవల సంభవించిన వరదలకు పెండ్యాలలో పూర్తిగా దెబ్బతిన్న వరిపంట

రైతులకు రూ.కోట్లల్లో నష్టం..



పేరకలపాడులో దెబ్బతిన్న పెసర పంట

భారీవర్షాలు, వరదలకు పత్తి, వరి పంటలు బాగా దెబ్బతిన్నాయి.అత్యధికంగా పత్తిపంట 11,845ఎకరాల్లో దెబ్బతినగా, వరి 9,570ఎకరాలు, పెసరపంట 3,027ఎకరాలు, మొక్కజొన్న 2,470ఎకరాలు, మినుము1,345ఎకరాలు, కందిపంట 62ఎకరాలు, నువ్వులు, చెరుకుపంటలు కలిపి మరో 28ఎకరాల మేర దెబ్బతిన్నాయి. ఇలా 28,347ఎకరాల్లో ఆయా పంటలు దెబ్బతినడంతో రైతులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది.

పరిహారం రూ.15.83కోట్లుగా లెక్క..

ఈ వరదల కారణంగా దెబ్బతిన్న ఆయా పంటలకు సంబంధించి బాధిత రైతులకు నష్టపరిహారం కింద రూ.15.83కోట్లు చెల్లించాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు ఇప్పటికే లెక్కకట్టారు. ఆయా మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, రెవెన్యూ సిబ్బంది కలిసి పంటనష్టాన్ని నమోదు చేశారు. అయితే నష్టపరిహారం మరో రూ.8కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. దీంతో బాధిత రైతులకు మొత్తం రూ.23కోట్ల వరకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని సమాచారం.

వాయిదా వేయకుండా ఇస్తారా?..

బాధిత రైతులు పంటనష్టపరిహారం కోసం ఆశగా ఎదురుచూస్తుండగా, సీఎం చంద్రబాబు మాత్రం పరిహారం పంపిణీ వ్యవహారాన్ని ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేశారు. తొలుత ఈనెల 17వ తేదీన బాధితులందరికీ పంటనష్టపరిహారాన్ని అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ తర్వాత ఈనెల 20వతేదీన అందజేస్తామని మరోసారి ప్రకటించారు. ఆ వాయిదాకు కూడా కాలం చెల్లింది. తాజాగా ఈనెల 25వతేదీన బాధితులందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో పంట నష్టపరిహారాన్ని జమచేస్తామని సీఎం ప్రకటించారు. దీంతో పరిహారం అందజేత వ్యవహారం ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిందని, ఇచ్చిన హామీ మేరకు ఈనెల 25వతేదీన అయినా పరిహారం అందుతుందో?లేదోనని బాధితులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం త్వరితగతిన పంటనష్టపరిహారాన్ని అందజేసి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



వరదలకు కొత్తపేటలో దెబ్బతిన్న పత్తిచేను



కీసరలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

వరదలతో తీరని నష్టం..



భారీ వర్షాలు, వరదలకు సాగుచేసిన పత్తి, పెసర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎకరంలో పెసర పంట సాగుచేశా. పంట చేతికొచ్చే సమయంలో వర్షాల కారణంగా గింజలన్నీ బూజు పట్టాయి. పత్తి కూడా పూర్తిగా దెబ్బతింది. దీంతో తీరనినష్టం వాటిల్లింది.

– గోగినేని వెంకటేశ్వరరావు
రైతు, కంచికచర్ల

నష్టపరిహారం ఎప్పుడిస్తారో..



గండేపల్లిలో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేశా. పెట్టుబడులు బాగా అయ్యాయి. కాని పత్తి, మొక్కజొన్న పంటలన్నీ వర్షాలకు దెబ్బతిన్నాయి. నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నాం. త్వరితగతిన పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– జూపూడి బాబు
కౌలురైతు, నందలూరు

20 ఎకరాల్లో పంట నష్టపోయా...



20ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న వరి పంటలు సాగుచేశా. పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చి వ్యవసాయం చేశా. వరదలకు పూర్తిగా పంటలన్నీ దెబ్బతిన్నాయి. తిరిగి వ్యవసాయం చేద్దామన్నా చేతిలో చిల్లిగవ్వలేదు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలి.

– గుదే సాంబశివరావు,
రైతు, గొట్టుముక్కల

పరిహారం ఇచ్చి ఆదుకోవాలి..



నాకు ఒక ఎకరం మాగాణి పొలంలో రూ.30వేలు ఖర్చుచేసి వరిసాగు చేశా. వరదలకు రోజుల తరబడి నీరు పొలంలోనే నిలిచి ఉండటంతో వరిపంట పాచిపోయింది. ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం కూడా ఇప్పటివరకు ఇవ్వలేదు. పరిహారం అందించి ఆదుకోవాలి.

– బొక్కా పిచ్చయ్య
రైతు, కంచికచర్ల

నిత్యాన్నదానానికి విరాళాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన లక్కిరెడ్డి కోటిరెడ్డి ఆదివారం రూ. 45,116లు విరాళంగా అందజేశారు. ఈమేరకు నగదును ఈవో వరప్రసాద్‌కు అందజేశారు. దాతను ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో అర్చకుడు రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10,116 విరాళం..

పెనుగంచిప్రోలు : గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి గుంటూరు చెందిన భక్తుడు రూ 10,116 విరాళాన్ని ఆదివారం అందజేశారు. గుంటూరుకు చెందిన తురిమెళ్ల కన్నాఅన్నపూర్ణ క్యాటరింగ్ సెంటర్‌వారు ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి ఈ విరాళాన్ని అందించారు. ఈ మేరకు నగదు చెక్కును ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. దాతను ఆలయ అధికారులు అమ్మవారి జ్ఞాపికతోపాటు ప్రసాదాలు అందించి సత్కరించారు.



ప్రజల ఆకాంక్షల మేరకే పాలన : నెట్టెం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగానే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం పేర్కొన్నారు. మండలంలోని చిల్లకల్లు సచివాలయంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. 100 రోజుల పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. దీపావళి పండుగకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు, ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ నాగరాజు, నాయకులు కట్టా నరసింహారావు, వెంకటేశ్వర్లు, రావూరి విశ్వనాథం, డేవిడ్ పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో...

నందిగామ టౌన్: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని 11వవార్డులో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబుపై విశ్వాసంతో ప్రజలు టీడీపీ కూటమికి పట్టంకట్టారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అనేంతగా ఆయన పాలన సాగిస్తున్నారని తెలిపారు. అనంతరం వార్డులో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు రఘురాం

రోడ్ల పరిస్థితి ఇలా.. ప్రచారం మాత్రం ఇంకోలా!



నందిగామలోని రామన్నపేట రోడ్డులో పడిన గొయ్యి



నందిగామ పాత బైపాస్‌లో దెబ్బతిన్న రోడ్డు

పాలకుల తీరుపై పెదవివిరుస్తున్న జనం

నందిగామ టౌన్: ఇది మంచి ప్రభుత్వమని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామంటూ ఊదరగొడుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం...ఆచరణలో మాత్రం నందిగామ పట్టణంలో దెబ్బతిన్న రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో ఆయారోడ్లలోని గోతులు టీడీపీ పాలనకు అద్దంపడుతున్నాయని పట్టణ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పట్టణంలోని సీఎం రోడ్డును విస్తరించి అభివృద్ధి చేశారు. సీఎస్‌ఆర్ నిధులతో రామన్నపేట, చందర్లపాడు వెళ్లే రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు చేపట్టిన చేపట్టిన కొద్ది రోజులకే ఎన్నికలు సమీపించడంతో ఆయా పనులను టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో అసంపూర్తిగా మిగిలిన ఆయా పనులను కూటమి ప్రభుత్వం వచ్చి 100రోజులవుతున్నా పట్టించుకున్న పాపానపోలేదు. ఇది మంచి ప్రభుత్వమంటూ ఊదరగొడుతున్న టీడీపీ కూటమి నాయకులు, నందిగామ పట్టణానికి ఈ 100రోజుల్లో చేసిన మంచి ఏమిటో తెలియక పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలతో జనాలను మభ్యపెట్టే కార్యక్రమాలను మానుకుని నందిగామ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నందిగామ పాత జిల్లాకోర్టు ఎదురుగా నిలిచిన మురుగునీరు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారి



సినీగీతాలకు అభినయం చేస్తున్న దిడ్డి పాండురంగారావు

జగ్గయ్యపేట అర్బన్: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కోదాడ రోడ్ స్థానిక మార్కెట్‌యార్డు ఎదురుగా రాయల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పలు సినీగీతాలకు పట్టణానికి చెందిన దిడ్డి పాండురంగారావు చేసిన అభినయం, డ్యాన్స్ ఆకట్టుకుంది. మీసాల బాబ్జీనాయుడు ఆర్కెస్ట్రా బృందం ఆలపించిన సంగీత విభావరి ఆహుతులను అలరించింది.

హోరెత్తిన నిమజ్జనాల సందడి



తొర్రగుంటపాలెం నుంచి గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



పేట కాకానినగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడి ఊరేగింపు

జగ్గయ్యపేట అర్బన్ : గణేష్ ఉత్సవాలలో భాగంగా ఆయా కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలకు 16వ రోజు ఆదివారంభక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేషుని విగ్రహాలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలివెళ్లాయి. నిమజ్జన ఊరేగింపులో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ డ్యాన్స్‌లతో సందడిచేశారు. తొర్రగుంటపాలెంలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడిని మేళతాళాలతో నిమజ్జనానికి తరలించారు. కాకానినగర్ వినాయకుడికి ఊరేగింపు నిర్వహించి, వేదాద్రి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

కంచికచర్ల సబ్‌రిజిస్ట్రార్‌గా నాగేశ్వరరావు

కంచికచర్ల : కంచికచర్ల సబ్‌రిజిస్ట్రార్‌గా నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆస్థానంలో బదిలీపై నాగేశ్వరరావు ఇక్కడికి వస్తున్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తరుపున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ విద్యార్థి సర్వజ్ఞ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో సర్వజ్ఞను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు అభినందించారు. సర్వజ్ఞ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటం తమ పాఠశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగబోయే 43వ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి నగరానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు అలివేలమ్మ పాల్గొన్నారు.



సర్వజ్ఞను అభినందిస్తున్న సూర్యప్రభ, వెంకట్రావు తదితరులు

లడ్డూ ప్రసాదంపై ఇష్టారాజ్యంగా మాట్లాడరాదు

మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ టౌన్: తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి ఇష్టారాజ్యంగా మాట్లాడటం తగదని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నిజనిర్ధారణ జరిగేంతవరకు అసత్య ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీయరాదన్నారు. దాడులకు పాల్పడటం తగదని ఆయన హితవు పలికారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన వెంకటేశ్వరస్వామివారి లడ్డూ ప్రసాదం విషయంలో తప్పిదాలు, అక్రమాలు, నాణ్యతా లోపాలుంటే సాంకేతికంగా అన్నిశాఖల అధికారులతో ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించాలన్నారు. తప్పు జరిగిందని తేలితే అందుకు దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అంతేకానీ విషయాన్ని పక్కదోవ పట్టించేలా ప్రచారం చేయడం, దాడులకు పాల్పడటం తగదన్నారు. ప్రజల మనోభావాలు, దేవుని పవిత్రత, దేశ, రాష్ట్ర ప్రతిష్టలకు సంబంధించిన వెంకటేశ్వరస్వామివారి లడ్డూ ప్రసాదం విషయంపై సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలపై నిజనిర్ధారణ చేయాలన్నారు. లడ్డూ ప్రసాద విషయానికి సంబంధించి అన్ని పరీక్షలు చేయిస్తేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. పరీక్షలలో తప్పు జరిగినట్లు తేలితే దోషులను కఠినంగా శిక్షించాలని.. తప్పు జరగలేదని తెలిస్తే స్వామివారి పవిత్రత, దేశ, రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతీసేందుకు యత్నిస్తూ అసత్యప్రచారాలు చేస్తున్నవారందరినీ కఠినంగా శిక్షించాలని డాక్టర్ జగన్‌మోహనరావు డిమాండ్ చేశారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమం

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కే శిల్ప ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు అందజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పేకాటశిబిరంపై ఆదివారం పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. చిల్లకల్లు పాలకేంద్ర సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పేకాడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ సూర్య శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,400ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వీరులపాడు: రౌడీ షీటర్లు తమ తీరు మార్చుకుని, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని వీరులపాడు ఎస్ఐ అనిల్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి ప్రతికదలికను గమనిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాలలో శాంతిభద్రతల విఘాతానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకునేవారిని గుర్తించి వారిపై రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఊరకుక్కల దాడులతో జనం బెంబేలు

వత్సవాయి : మండలంలోని ఆయా గ్రామాల్లో ఊరకుక్కల దాడులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల వెంబడి గుంపులుగుంపులుగా దర్శనమిస్తూ ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న వారిని వెంటపడి గాయపరుస్తున్నాయి. ఈక్రమంలో వాహనాలు అదుపుతప్పి కిందపడిపోతుండటంతో పలువురు గాయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో చిన్నారులను వీధుల వెంట ఆరుగులపై కూర్చున్న వారిని కుక్కలు దాడిచేసి కరుస్తున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వాహనాల్లో కుక్కలు తీసుకువచ్చి రాత్రి సమయాల్లో వదిలివెళ్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు అనుమానిస్తున్నారు. ఇటీవలి కాలంలో పదుల సంఖ్యలో కొత్తకుక్కలు దర్శనమిస్తుండటమే ఇందుకు నిదర్శనమని వారు చెబుతున్నారు. మూడునెలలుగా కుక్క, కోతి కాటుకు గురైన వైద్యశాలలను సంప్రదిస్తున్నవారి సంఖ్య కూడా అధికంగానే ఉందని వైద్యసిబ్బంది చెబుతుండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఊరకుక్కల బారి నుంచి తమను కాపాడాలని వత్సవాయి మండల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్రసాదాల నాణ్యత తనిఖీ



పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో లడ్డూ నాణ్యత లేదంటూ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలోని ప్రసాదాల తయారీ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లడ్డూ తయారీలో వినియోగించే ముడి సరుకులు నెయ్యి, జీడిపప్పు, శనగపిండి నాసిరకంగా ఉన్నట్లు తేలడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లడ్డూ నాణ్యత లేకపోవడంపై ప్రశ్నించారు. మిగిలిన సరుకుల నాణ్యతను నిర్ధారించాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్‌జేసీ లీలా కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'వల్లాల' కుటుంబానికి నేతల పరామర్శ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం, వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లాల విశ్వేశ్వరరావు(విసు)(60) ఆదివారం మృతి చెందాడు. విశ్వేశ్వరరావు శనివారం రాత్రి గుండెపోటుకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆయనను వెంటనే విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆయన ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వల్లాల విశ్వేశ్వరరావు మృతదేహాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి, ఏఎంసీ మాజీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయ దాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

2 నుంచి శరన్నవరాత్రులు

విజయవాడకల్చరల్: శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో అక్టోబరు 2 నుంచి 13వ తేదీ వరకు శివరామకృష్ణ క్షేత్రంలో శారదా శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఠం సంప్రదాయాన్ని అనుసరించి 2వ తేదీ బుధవారం జగత్ప్రసూతికాంబ అలంకారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, శ్రీ శారదాంబకు అభిషేకం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 5వ తేదీ శ్రీరామభాగవతార్చే భజరే శారదాంబ నామసంకీర్తన, శ్రీ సద్గురు సంగీత సభ సహకారంతో తాతా సందీప్ శర్మ అవధాన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

బహుముఖ ప్రతిభాశాలి ఆచార్య ఆత్రేయ

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి సాహితీవేత్త ఆచార్య ఆత్రేయ అని కేంద్ర విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో సినీ పాటల పరిశోధకుడు పైడిపాల వ్యాససంపుటి అక్షరశిల్పి ఆత్రేయ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆత్రేయ 35వ వర్ధంతి సందర్భంగా హోటల్ ఐలాపురంలో ఆదివారం నిర్వహించారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. ఆత్రేయ కలం నుంచి వచ్చిన ఆణిముత్యాల వంటి పాటలు ఆనాటి యువతరాన్ని కదిలించాయని గుర్తు చేశారు.

డాక్టర్ ఇండ్లకు అంకితం..

సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చిత్రం విజయవంతం కావడానికి పాటలు, మాటలు దోహదపడతాయని ఆత్రేయ నిజం చేశారన్నారు. ఆయన పాటలు నిర్మాతలకు కాసులవర్షం కురిపించాయని తెలిపారు. వ్యాస రచయిత పైడిపాల మాట్లాడుతూ ఆత్రేయ సాహిత్యం తన జీవితానికి బాటలు వేసిందన్నారు. ఆయన రాసిన నాటకాలు విజయవంతమయ్యాన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ గ్రంథ విశేషాలను వివరించారు. గ్రంథాన్ని ప్రముఖ మానసిక వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డికి అంకితమిచ్చారు. సభకు ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అధ్యక్షత వహించారు. బోడి ఆంజనేయరాజు, వి.సుబ్బయ్య పాల్గొన్నారు.